క్లుప్తంగా

విద్యార్థి నేతల గొంతు నొక్కడం తగదు



జీఓ కాపీలను దగ్ధం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే విద్యార్థి సంఘాల నేతల గొంతు నొక్కడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ మండిపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ కాపీలను వారు దగ్ధం చేశారు. ఆదివారం పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో వెంకట్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను కాలరాసేలా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు రోహిత్, సహాయ కార్యదర్శి ఫర్హాన్, నాయకులు శంకరప్ప, ప్రవీణ్, రంజిత్, వంశీ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

గుంతకల్లుటౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 7వ మహాసభలు నిర్వహించారు. నాగేంద్ర మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు 2020 సెప్టెంబర్ నుంచి నిలుపుదల చేసిన వివాహాలు, ప్రసవాలు, సహజ, ప్రమాద మరణాల పరిహారాలను వెంటనే చెల్లించాలని, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించి ఉచిత ఇసుక ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రసాద్, కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా వేణు, 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, నాగరాజు, వెంకటనారాయణ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని కోరుకుంటూ ఆయుష్య హోమం నిర్వహించారు.

ఏపీఎస్ఈబీ రూల్స్ అమలు చేయాలి



మాట్లాడుతున్న మల్లికార్జున రెడ్డి

గుత్తి: జేఎల్ఎం గ్రేడ్-2 (ఎనర్జీ అసిస్టెంట్లు)లకు ఏపీ ఎస్ఈబీ రూల్స్ అమలు చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ రంగంలోని కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, జేఎల్ఎంలకు ఏఎల్ఎం లుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఎనర్జీ ఉద్యోగుల, కార్మికుల సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గుత్తి డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సురేష్ యాదవ్, జనరల్ సెక్రటరీగా నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా భాస్కర్‌నాయక్, శరత్, కోశాధికారిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఖాదర్ బాషా, విజయ్, సహాయ కార్యదర్శులుగా శంకర్, సంతోష్, ధనుంజయ, పరుశురాం నాయక్, కార్యవర్గ సభ్యులుగా రామాంజనేయులు, మహేష్, రఘు, సలీం , హరి గోపాల్ ఎన్నికయ్యారు.

నిబంధనలు బేఖాతర్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. ఒకవైపు అధికారులు, మరోవైపు పోలీసులు చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోవడం లేదు. పట్టణంలోని నందలపాడు, యల్లనూరు రోడ్డు సర్కిల్‌లోని పెట్రోల్ బంకులు నిబంధనలను భేఖాతరు చేస్తున్నాయి. అత్యంత సమస్యాత్మకంగా ఉన్న తాడిపత్రి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం బాటిళ్లు, క్యాన్‌లల్లో పెట్రోల్‌ను పట్టరాదని గతంలో పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. పెట్రోల్ బంకుల్లోని పంపులకు నోటీసులు సైతం అతికించారు. ప్రస్తుతం ఏ పంపులో కూడా పోలీసు హెచ్చరికల నోటీసులు లేవు. హెచ్చరికలను పట్టించుకోకుండా క్యాన్‌లు, బాటిళ్లకు పెట్రోల్ పడుతున్నారు. అలాగే పెట్రోల్ పంపుల వద్ద సెల్‌ఫోన్లను ఉపయోగించరాదన్న నిబంధనలు కూడా ఉన్నాయి. సెల్‌ఫోన్ల నుంచి వచ్చే తరంగాల వల్ల అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెట్రోల్ బంకుల్లో సెల్‌ఫోన్లల్లో మాట్లాడటం, ఆపరేటింగ్ చేయరాదని ఆదేశించింది. కానీ పంపుల వద్ద పెట్రోల్ పోసే బాయ్స్ మాత్రం నిబంధనలను పట్టించుకోకుండా సెల్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. ఒకవైపు పెట్రోల్‌ను వాహనాల్లో నింపుతూ మరోవైపు సెల్‌ఫోన్లను ఆపరేటింగ్ చేస్తున్నారు. పెట్రోల్ బంకులపై రెవెన్యూ అధికారుల నిఘా లేకపోవడం వల్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అలాగే తరుచూ వాహనదారులతో సిబ్బంది గిల్లికజ్జాలు పెట్టుకుంటూ గొడవపడుతున్నారు. అధికారులు స్పందించి పెట్రోల్ బంకులో తనిఖీ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



బాటిల్‌లో పెట్రోల్ నింపుతున్న దృశ్యం



వాహనంలో పెట్రోల్ నింపుతూ సెల్‌ఫోన్ చూస్తున్న బాయ్

నెల రోజులకే రోడ్డు గుంతలమయం



గుంతలమయమైన రోడ్డు

పెద్దపప్పూరు: మండలంలోని పసలూరు నుంచి కమ్మవారిపల్లెకు నెల రోజుల క్రితం రోడ్డు మరమ్మతులు చేశారు. అయితే రాయలచెరువు నుంచి మట్టిని తరలిస్తున్న లారీల కారణంగా నెలరోజులు కాకమునుపే రోడ్డు గుంతలమయమైంది. అధికలోడుతో వెళ్తున్న వాహనాలను అరికట్టి తిరిగి మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరారు.

స్మార్ట్ మీటర్లపై బాబు రెండు నాల్కల ధోరణి

తాడిపత్రి రూరల్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు నాలుకల ధోరణి అవలంభిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మండిపడ్డారు. పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ఎన్టీఆర్ కల్యాణ మండలంలో ఆదివారం 16వ మహాసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను పగుటకొట్టాలని పిలుపునిచ్చి అధికారంలోకి రాగానే వాటిని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీపీఐ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను పగులకొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కరెంట్ చార్జీలపై కూడా ఇచ్చిన మాట తప్పి విపరీతంగా పెంచుతూ ప్రజల నడ్డి విడుస్తున్నాడన్నారు. వీటన్నింటిపై ఈ నెల 5న ఆందోళన చేపడతామన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రంగయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను వ్యతిరేక చట్టాలతో దగా చేస్తున్నాయన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ఉద్యోగాలను తొలగిస్తూ కార్మికులను వీధిపాలు చేస్తున్నాయన్నారు. నియోజక వర్గ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, పట్టణ కార్యదర్శి చిరంజీవి, సహాయ కార్యదర్శి వెంకటయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

వరుణుడి కరుణ కోసం పూజలు

యాడికి: వానదేవుడి కరుణ కోసం ఊరూరా పూజలు మొదలయ్యాయి. వర్షాలు కురవాలని కోరుతూ గ్రామ దేవతలకు జలాభిషేకాలు, సప్త భజనలు చేయడం, కుండ నీటిలో కప్ప ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని దైవాలమడుగులో గ్రామ దేవతలు, దేవుళ్లకు అభిషేకాలు చేపట్టారు. బొడ్రాయికి 101 బిందెలతో జలాభిషేకం, శ్రీరాముల ఆలయంలో తమలపాకుతో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నీటికుండలో ఉన్న కప్పను ఇంటింటికీ తీసుకువెళ్లి జలాభిషేకం చేశారు. అనంతరం వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని కాటమయ్యకు పూజలు చేశారు. గ్రామంలో నుంచి తెచ్చుకున్న పులగం, కారంతో భోజనాలు చేసి తాగేందుకు నీరు లేకుండా పెద్దలతో పాటు చిన్న పిల్లలు కూడా దేవున్ని ప్రత్యేకంగా దేవుడిని వేడుకుంటూ ఇంటికి చేరుకున్నారు.



కాటమయ్యకు పూజలు చేస్తున్న దృశ్యం

వైభవంగా ముత్యాలమ్మ జాతర



అలంకరణలో ముత్యాలమ్మ



హారతి తీసుకుంటున్న భక్తులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, నరేష్‌నాయుడు (నర్రి) ఆధ్వర్యంలో ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు ముత్యాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. గుత్తి, గుత్తి ఆర్ఎస్‌ల నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ముత్యాలమ్మ భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి అంబలి, బోనాలు సమర్పించారు. మహా మంగళహారతి, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. సాయంత్రం పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుత్తి: పట్టణంలోని పులిగుట్ట విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటనెన్స్ (మరమ్మతు) పనుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

హాస్టల్‌లో అదనపు గదులు నిర్మించాలి

గుత్తి: పట్టణంలోని బీసీ బాలికల కళాశాల హాస్టల్లో అదనపు గదులు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం డివిజన్ బీసీ వెల్ఫేర్ అధికారిణి రంగమ్మకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్ యాదవ్, బాలాజీ తదితరులు అదనపు గదులు నిర్మించాలని విన్నవించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బీసీ బాలికల కళాశాల హాస్టల్లో గదుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి వేళల్లో ఆరు బయట నిద్రించాల్సి వస్తోందన్నారు. వెంటనే అదనపు గదులు నిర్మించాలని డిమాండ్ చేశారు.

'అన్ని దానాల్లో రక్తదానం మిన్న'

పామిడి: అన్ని దానాల్లో రక్తదానం మిన్న అని ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి, పామిడి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లపాటి తిరుపతినాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని పీ కొండాపురంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 23 మంది రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఆలంబన్ జనార్దన్, జీవన్‌కుమార్, మూర్తి, హరిక్రిష్ణ, స్టాఫ్ నర్స్ సరళ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీరరావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, కోశాధికారి డీ షెక్షావలి, జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ డాక్టర్ మిద్దే శాంతిప్రియ, జిల్లా చైర్‌పర్సన్ పీసీ జయరాంరావు, మహేష్, గంగాశేఖర్, షెక్షా, ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బుక్కరాయసముద్రం: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, లేని పక్షంలో వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పుల్లయ్య హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం బీకేఎస్‌లో మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి



యాడికి మండలం తూట్రాళ్లపల్లిలో కరపత్రం అందజేస్తున్న మండల కన్వీనర్ సంజీవరాయుడు



పుట్లూరు మండలం శనగలగూడూరులో 'రీ కాలింగ్' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెద్దపప్పూరులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గార్లదిన్నె మండలం తిమ్మంపేటలో రీకాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



శింగనమల మండలంవెస్ట్ నరసాపురంలో రీకాలింగ్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

యాడికి/పుట్లూరు/పెద్దపప్పూరు/గార్లదిన్నె: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిందని సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవ రాయుడు అన్నారు. యాడికి మండలంలోని తూట్రాళ్లపల్లిలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు బనా యిస్తూ జైళ్లకు పంపుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు అనేక పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలరెడ్డి, కేశవరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగస్వామి, నారాయణ, వెంకటేస్, రామాంజనేయులు, తిరుమల, రాంప్రసాద్ పాల్గొన్నారు.

- పుట్లూరు మండలంలోని శనగలగూడూరు, ఎస్.కొండేపల్లి గ్రామాల్లో ఆదివారం 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి, నాయకులు గాడిబావి శివారెడ్డి, మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు రామక్రిష్ణారెడ్డి, జనార్దననాయుడు, ఉప సర్పంచ్ జయరామిరెడ్డి, రమణారెడ్డి, మద్దిలేటిరెడ్డి, నామాల వెంకటేశ్వరరెడ్డి, శేషా, రామ్మోహన్, విష్ణునారాయణ, కంచెం శ్రీనివాసులరెడ్డి, నారాయణస్వామి, సూరి, లక్ష్మీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- పెద్దపప్పూరులో 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మైనార్టీ నాయకుడు హాజీవలి, నాయకులు ప్రతాప్ రెడ్డి, భాగ్యరెడ్డి, రఫీ, మహేష్, మసూద్‌వలి, డిష్ బాషా తదితరులు పాల్గొన్నారు.
- గార్లదిన్నె మండలంలోని కనంపల్లి, తిమ్మంపేట, తలగాచిపల్లి గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, శింగనమల నియోజకవర్గ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, లింగారెడ్డి, ఓబిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
- శింగనమల మండలంలోని చిన్నజలాలపురం, గురుగుంట్ల, వెస్ట్ నరసాపురం, నాగులగుడ్డం, తండా గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం మండల కన్వీనరు పూల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వీరాంజనేయులు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, జిల్లా నాయకుడు తరిమెల భాస్కర్‌రెడి, సర్పంచ్ వెంకటరాముడు, కోఆప్షన్ మెంబరు ఆలీ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌వీ నారాయణ, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు బండి లలిత కళ్యాణి, నాయకులు మల్లికార్జునరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు నాయక్, భాస్కర్, నారాయణస్వామి, పుల్లప్ప పాల్గొన్నారు.

పీ కొత్తపల్లిలో మళ్లీ నీటి కష్టాలు

పామిడి: మండలంలోని పీ కొత్తపల్లిలో తాగునీటి కష్టాలు మొదటి కొచ్చాయి. పీ కొత్తపల్లిలో తాగునీటికి కటకట అన్న గత నెల 21న ప్రచురితమైన సాక్షి శీర్షికకు పామిడి పంచాయతీ ఈఓ కమ్ ఈఓఆర్డీ అశ్వర్థనాయుడు స్పందించారు. కొన్నిరోజులు ఈఓ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి గ్రామస్తులకు తాగునీటి కష్టాలు తీర్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అలసత్వం వల్ల మోటారు మరమ్మతులకు నోచుకున్నా, నిర్వహణలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యవైఖరి గ్రామస్తుల పాలిట శాపంగా మారింది. పామిడి పెన్నానది నుంచి విద్యుత్‌బోర్ మోటార్ ద్వారా పైప్‌లైన్ ద్వారా గ్రామానికి నీటి సరఫరాలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతులెత్తేశారు. దీంతో నాలుగురోజులుగా గ్రామానికి తాగునీరు సరఫరా చేసేవారే కరువయ్యారు. దీంతో గ్రామస్తులు తోటల్లోని బోర్ల ద్వారా ట్రాక్టర్లలో క్యాన్‌ల ద్వారా ఇంటికి నీరు తెచ్చుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.



తోటలో నుంచి ట్రాక్టర్‌లో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

గుంతకల్లుటౌన్: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికల్లో ఓట్ల తొలగింపు, ఈవీఎంల ట్యాంపరింగ్, రిగ్గింగ్‌లకు పాల్పడి దొడ్డిదారిన గెలిచేందుకు మోదీ సర్కారు కుట్రలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డి.జగదీష్ విమర్శించారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మోదీ ఆర్ఎస్ఎస్‌ల కనుసన్నల్లోనే ఏపీలో చంద్రబాబు నియంత పాలన కొనసాగిస్తున్నారన్నారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు వెళ్లరాదని ఉత్తర్వులివ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు రూ.కోట్ల విలువ చేసే భూములను ఎకరా కేవలం 99 పైసలకే కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ వారికి ఊడిగం చేస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మం ముసుగులో మతాల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. భావసారూప్యత కలిగిన సెక్యులర్ పార్టీలను కలుపుకుని పెద్దఎత్తున పోరాటాలు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

ఈ నెల 9,10న సీపీఐ గుంతకల్లు పట్టణ మహాసభలు, 12,13న జిల్లా మహాసభలు, 23 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్ 22 నుంచి 25 వరకూ చండీఘడ్‌లో జాతీయ సీపీఐ మహాసభలు జరుగుతాయని జగదీష్ తెలిపారు. మహాసభల్లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు గోవిందు, నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి గౌస్, మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

'హాస్టళ్లలో మెనూ పాటించండి'

శింగనమల: మండలంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ పాటించడం లేదని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ అన్నారు. ఆదివారం శింగనమలలోని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహాల్లో ఎక్కువ మంది విద్యార్థులుంటే , తక్కువ మోతాదులో చికెన్, గుడ్లు, అరటిపండ్లు ఇస్తున్నారన్నారు. అవి కూడా నాణ్యతగా లేవన్నారు. వసతి గృహాలకు ప్రహరీ లేదని, భోజనం సమయంలో కుక్కలు, పందులు వస్తున్నాయని, విద్యార్థులు భయపడుతున్నారన్నారు. రాత్రిళ్లలో విద్యార్థులు దోమలు బారిన పడుతున్నారన్నారు. వసతి గృహాలకు వార్డెన్లు, సిబ్బంది లేరని, ఇన్‌చార్జ్‌లు రెండు వసతి గృహలకు పని చేస్తున్నారని, తద్వారా విద్యార్థుల పర్యవేక్షణ కరువైందని, వెంటనే సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మణికంఠ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన అశ్వత్థ క్షేత్రం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రానికి శ్రావణమాసం రెండో ఆదివారం సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు శింగరబట్టు, గణపతి, నారాయణస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, చక్రభీమలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి వారికి ముడుపులు, కానులతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఈఓ సుబ్రమణ్యం సౌకర్యాలు కల్పించారు.

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండవ ఆదివారం సందర్భంగా ప్రధాన అర్చకుడు రామాచా ర్యు లు స్వామికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

చర్చి కమిటీ ఎన్నికల్లో రూల్స్ బ్రేక్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సెయింట్ ఆండ్రూస్ ఎస్‌పీజీ (గంట) చర్చ్ కమిటీ ఎన్నికల్లో చర్చి గురువులు రూల్స్‌ను బ్రేక్ చేశారని కమిటీ మాజీ కార్యదర్శి ఇజ్రాయెల్, మాజీ కోశాధికారి జి.జి.రాజు అన్నారు. ఆదివారం చర్చి మీటింగ్ హాల్‌లో వారు విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. గత నెల 30న జరిగిన ఎన్నికల్లో ఏడుగురు సభ్యులు గెలిచిన ప్యానల్‌ను కాకుండా కేవలం ముగ్గురు సభ్యులు గెలిచిన ప్యానల్‌కు చర్చ్‌కమిటీలో కీలక పదవులు అప్పగిస్తున్నట్లు చర్చి గురువులు ప్రకటించడాన్ని వారు ఖండించారు. గతంలో కమిటీ కోశాధికారిగా పనిచేసి చర్చ్ డెవలప్‌మెంట్ ఫండ్ డబ్బును కాజేసిన మాజీ కోశాధికారి విన్సెంట్ అనే వ్యక్తి పోటీ చేయడానికే అనర్హుడన్నారు. అయితే గురువులు విచక్షణాధికారాలను వినియోగించి అవినీతికి పాల్పడిన వ్యక్తినే తిరిగి కోశాధికారి కుర్చీలో కూర్చోబెట్టి భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రకటించిన కమిటీని రద్దు పరిచి ఏడుగురు సభ్యులు గెలిచిన ప్యానల్‌కు పదవులివ్వాలని వారు డిమాండ్ చేశారు. అవినీతిపరుడిని అందలమెక్కించిన గురువులపై కూడా చర్చ్ డియోసిస్, బిషప్‌లకు ఫిర్యాదు చేస్తామని, అక్కడ కూడా న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్‌రావు, సురేష్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చర్చి కమిటీ మాజీ కార్యదర్శి ఇజ్రాయెల్

గుర్తు తెలియని వాహనం ఢీ.. మహిళకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎల్లమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మ అనే మహిళ బిక్షాటన చేసుకుంటూ కొన్ని రోజులుగా రజాపురం గ్రామ శివార్లలో తిరుగుతూ ఉండేది. ఈ క్రమంలో తెల్లవారుజామున రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

బ్రాందీ షాపులో చోరీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ రోడ్డులో పూలే విగ్రహం సమీపంలో ఉన్న భవానీ బ్రాందీ షాపులో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. రూ.48,500 నగదుతో పాటు బ్రాందీ బాటిళ్లు అపహరించారు. వివరాల్లోకి వెళితే.. ఓ దొంగ ముఖానికి ముసుగు ధరించి దుకాణానికి కన్నం వేశాడు. లోపలికి ప్రవేశించి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ. 48,500 నగదుతో పాటు బ్రాందీ బాటిళ్లు ఎత్తుకెళ్లాడు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బ్రాందీ షాపును అనంతపురం క్లూస్ టీం సభ్యులు యూనిస్, బాషా పరిశీలించి, వేలిముద్రలు సేకరించారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.